# పెళ్లి సంబరం

రావు: రాధా, రాధా!

రాధ: ఎప్పుడొచ్చారండీ, చడీచప్పుడూ లేకుండా.

రావు: ఇది మరీ బాగుంది. 'రాజు వెడలె రవి తేజమలరగా' అంటూ నాకు నేనే బరాబరులు పలుక్కుంటూ రావాలన్న మాట! నీకంత ముచ్చటగా వుంటే, రేపటి నుంచీ అలాగే వస్తాను గానీ, కాసిని మంచినీళ్లు తీసుకరా, ఇదిగో, అలాగే ఉత్తరాలేమైనా వచ్చాయేమో చూడు.

రాధ: ఉత్తరాలేవీ లేవుగానీ, యిన్విటేషనేదో వచ్చింది...

రావు: వచ్చింది గదా! అనుకుంటూనే వున్నాను, ఈ పెళ్లిళ్ల సీజనులో ఇలాంటిదేదో జరుగుతుందనీ, రాణిగారి వుత్సాహం కట్టలు త్రెంచుకుంటుందనీ! అన్నట్టు ఆ ఆహ్వానం ఏ దిక్కునుంచి వచ్చిందో చెప్పావు గావు...

రాధ: చెప్పనిస్తే గదుటండీ! పెళ్ళి అనగానే మీకు గుండెల్లో గుబులు బయల్దేరుతుందాయె...

రావు: ఇప్పుడు బయల్దేరి మాత్రం లాభమేముందిలే రాధా, జీవితంలో ఆ పొరబాటు కాస్తా జరిగిపోయిన తర్వాత! చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకోవడాలు, గత జల సేతు బంధనాలూ ఎందుకు చెప్పు. అందుకే 'గతం నశోచామి' అనేశారు పెద్దలు!

రాధ: ఇప్పుడు మీ తలపైకొచ్చి పడిన కష్టమేమిటండీ! ఐతే మీ చేతినుంచి పది పదిహేను రూపాయలు వదిలిపోతాయనీ బంధువు లెవరూ శుభకార్యాలు తలపెట్ట గూడదంటారు! అంతే గదూ!

రావు: ఎంతమాటెంత మాట! మనకింకా పిల్లల్లేరు గానీ, భగవంతుడి ధర్మాన నీ కడుపు పండి ఓ ఆడపిల్ల పుట్టి, ఆ పుట్టిన ఆడపిల్లకు పెళ్ళీడొస్తే అప్పుడు మనకు అనుభవైక

వేద్యమౌతుంది. ఆడపిల్లలున్న తల్లిదండ్రుల బాధ! ఆమాటకొస్తే అతి విస్తృతమైన మన బంధు లోకంలో ఈడొచ్చిన ప్రతి అమ్మాయికి చక్కటి వరుడు దొరికి, గోరువంకల వెంట చిలకల్లా శుభమా అని అందరూ అత్తారిళ్ళకు వెళ్ళిపోతే అంతకంటే మన కానందప్రదమైన విషయం మరొకటి వుండదు. కానీ, ఒక చిన్న షరా– అత్తారింటికి వెళ్ళిన ప్రతి అమ్మాయీ ఆ మొగుడున్న వాడి సంపాద నెంత, తాహ తెంత, అతడి నుంచి పొందగల సౌకర్యాల పరిమితి ఎంత అన్న విషయాలను గురించి కాస్త సునిశితంగా ఆలోచించి సబావైన నిర్ణయాలకు రాగలిగితే చాలు! బస్, అంతటితో అటు పుట్టినిల్లూ, యిటు మెట్టినిల్లూ గూడా తరించిపోతాయి!

రాధ : చాల్లెండి! మీ ఎత్తి పొడుపులు అర్థం కానంతటి మూర్ఖురాల్ని గాను. న న్నేడిపించడానికి గాకపోతే, యిప్పుడు నేను మన తాహతుకు మించిన కోరికలేం కోరుతున్నానో చెప్పండి! ఏ ప్రసక్తినైనా మెలికలు త్రిప్పి, చివరకు నా చాప క్రిందకే నీళ్ళు తేవడం మీ అలవాటు!

రావు: మనం ఒకరి చాప క్రిందకే ఒకరం నీళ్ళు తెచ్చుకోక, మూడో వ్యక్తి జోలికి పోగలమా రాధా! పోనీలే, ఎందుకొచ్చిన గొడవ! మళ్ళీ మొదటికే వద్దాం. ఇన్విటేషను వచ్చిందన్నావు. వధు వెవరు? వరు డెక్కడి వాడు? వివాహ మెచ్చట?

రాధ : మనం రోజూ అనుకుంటూవున్న పెళ్ళేగదండీ!

రావు: 'మనం' అన్న బహువచనం నిషిద్ధం! పెళ్ళిళ్ళ విషయంలో నాకింకా ఊహాగానాలు చేతగావు. నువ్వు ప్రతి రోజూ ఒకానొక పెళ్ళిని గురించి ఆలోచిస్తూ, ఏతద్వివాహం తాలూకు ఆహ్వానం కోసం ఎదురుచూస్తుండేదాని వన్నమాట! 'నచ్చిన కోడలు వచ్చిందన్న, సినిమా పేరులా ఆ ఆహ్వానం గూడా రానేవచ్చిందన్నమాట! ఏమిటో అనుకున్నాను గానీ నువ్వు సిద్ధ సంకల్పురాలివి రాధా!

రాధ : అయ్యో, యిదేం బాధండీ మీతో! తీరా పెళ్లెవరికో చెబుదామన్నా వినిపించుకోరు మీరు!

రావు: అబ్బెబ్బే, సావధానుణ్ణి. సెలవివ్వు మరి!

రాధ : పెళ్ళి మరెవరికోగాదు, మా నిర్మలకు!

రావు: నిర్మల! అలాటి పేరుగల అమ్మాయి లొకరిద్దరు మన బంధు బలగంలో వున్నట్టే జ్ఞాపకం...

రాధ : నా తెలివితక్కువ గాకపోతే మీతో ప్రసంగానికి పూనుకుంటానటండీ! మా జగదీశం మాంవయ్యగారి మూడో అమ్మాయి నిర్మలే తెలియదూ మీకు?

రావు: తెలుసు, తెలుసు, అంతలోనే కోపమైతే ఎలా తట్టుకోగలను రాధా! అయితే ఆ నీలి కళ్ళ నిర్మలాదేవికి పెళ్ళన్నమాట! మంచిది, తొందరగా వరుడి పేరేమిటో చెప్పు...

రాధ: మామూలు పేరే లెండి, నాగరాజారావు.

రావు: గుడ్ గుడ్, వుండు మరి! నాకు ఆశుకవిత్వం అంత బాగా రాదుగదా! ఐనా ఫరవాలేదు, పేర్లు గణాలకు సరిపోతున్నాయి గనుక సగం బెడద తప్పినట్లే... రాగ భరిత మనస్కుడు నాగరాజు నిరుపమానంద పుంజమ్ము నిర్మలాంబ...

రాధ: ఎగతాళికి గాకపోతే ఆనందపుంజ మేమిటండీ! ఇంతకూ అది మీకు వరుసకు మరదలు పిల్లయినా గాకపోయె...

రావు: పోనీలే, పద్యోపాయనం సంగతి తీరిగ్గా ఆలోచిద్దాం. మిగతా వివరాలు చెప్పు...

రాధ: పెళ్లి మా జగదీశం మామయ్యగారి స్వగృహంలోనే జరుగుతుంది...

రావు: సహజమే! సాలంకృత కన్యాదానానికి స్వగృహం కంటే మించిన స్థలం మరొకటి వుండబోదు. తరువాత, తరువాత...

రాధ: ఇది మా జగదీశం మాంవయ్యగారింట్లో చివరి పెళ్ళి గనుక మా బంధువుల్లో ప్రతి ఒక్కరూ తప్పకుండా అందరూ పిల్లా జల్లాతో సహా కదలి రాబోతున్నారన్న మాట...

రావు: పిల్లా జల్లా మాత్రమే గదా! బంధుమిత్ర పరివార సమేతంగానైతేనే యిబ్బంది! ఐతేనేం, మీ బంధులోకమంతా ఒక పందిరి క్రింద చేరితే చాలదేమిటి! అది చెప్పుకో దగ్గ విశేషమే ఔతుంది. ఉండుండు; అన్నట్టు యిక్కడ నాకు అపశకునం లాంటి సందేహం ఒకటి కలుగుతోంది రాధా! కొంపదీసి ఈ పెళ్ళికి మీ పార్వతమ్మ పిన్నిగారి కూతురు శ్రీమతి వసంత కుమారి రాదు గదా!

రాధ: వస్తే వస్తుంది. మనకు దాని వూసెందుకూ?

రావు: అదేం మాట! మనం వదల దలచుకుంటే మాత్రం ఆ వూసు మనల్ని వదులుతుందా రాధా! అదృష్టం కొద్దీ ఓ సుమారుపాటి ఆఫీసరు మొగుడుగా దొరికాడు గదా అని ఆమె పెట్టెనిండుకూ చీరలతో దిగి గంట గంటకూ ఓ చీరతో ముస్తాబై పందిరిలోకి వచ్చేస్తుంది. ఆ పగటి వేషాన్ని చూడనూ చూడనూ నీలాటివాళ్ళకు మతిపోతుంది. ఆ క్షణాన భార్యలకు రకాని కొక చీర కొనిపెట్టలేని భర్తల్లో చెలరేగే చిత్త సంక్షోభం వూహించుకోవలసిందే మరి! అందుకే పెళ్ళంటే ఏమిటని ఎవరైనా – అడిగితే, అంతస్తులూ, హోదాలు ఏమిటని ఎవరైనా – అడిగితే, అంతస్తులూ, హోదాలు అలంకారాలతో అందాలకు మెరుగుబెట్టుకుని ప్రదర్శనానికి తరలివచ్చే 'ఎగ్జిబిషన్' అంటాను.

రాధ : నిజమేననుకోండి! కానీ మనం గూడా నలుగురితోబాటు నారాయణా అనాలి గదా! మనం లేమితో సతమతమౌతున్నామని, పదిమందిలో ఆ లేమిని ప్రదర్శించుకోడానికి మనసొప్పదుగదా!

రావు: ఐతే ఆ లేమికొక మేలిముసుగు తగిలించమంటావ్!

రాధ : తప్పుతుందా మరి! ఇన్విటేషను రాగానే పొరుగింటి పంకజమ్మకు ఓమాట చెప్పివచ్చాను. ఆవిడ భర్త మొన్ననే హైదరాబాదు వెళ్ళొస్తూ రెండు ఔరంగాబాదు సిల్కుచీరలు తెచ్చాడులెండి! పోతే మా క్లబ్బు సెక్రటరీ త్రిపురసుందరి వుండనేవుంది! కాకిచేత కబురంపితే చాలు, బోలెడు చీరలు పంపిస్తుంది.

రావు: ఐతే నీ అంతకు నువ్వే ఓ సమస్యను పరిష్కరించుకున్నా వన్నమాట!

రాధ : భయపడకండి! మీకోసం మరొకటి అట్టిపెట్టి వుంచాను. ఉడుపులు సమకూరితే చాలదు, నగలు?

రావు: చంపేశావు, ప్రస్తుత పరిస్థితుల్లో నేను గిల్టు నగలు గూడా కొనే స్థితిలో లేను!

రాధ : కావలసిన వస్తువులన్నీ కొనక తప్పదనుకున్నట్టయితే యిక మన పనైనట్టే! బరువుచేటైనా పరువుకోసం ఎరువు సొమ్ము మోయక తప్పదు.

రావు: ఎందుకొచ్చిన గొడవలే రాధా! తీసుకెళ్ళిన బట్టలతో, నగలతో భద్రంగా యింటికి తిరిగొచ్చేదాకా గుండె బిక్కు బిక్కుమంటూనే వుంటుంది.

రాధ : ఎందుకు లెండి! శుభ్రంగా పెళ్ళికి వెళ్ళడమే మానేస్తే సరిపోతుంది.

రావు: ఎంతమాటెంతమాట! ఏదో మాటవరుసకన్నానులే రాధా! ఈ మాత్రానికే కళ్ళల్లో కొలన్లు సృష్టించుకుంటే ఎలా చెప్పు! జీవితం నవరసభరితంగా వుండాలిగదా అని అప్పుడప్పుడూ కాస్త విషాదాన్ని సైతం ప్రవేశపెడుతూ వుంటాను. కానీ, మనం విషాద విచారాలను ఒక నిమిషానికి మించి తట్టుకోలేము. ఏదీ– ఒక్కసారి... ఒక చిరునవ్వు...

రాధ : చిరునవ్వే చిన్నదైతే మళ్ళీ దానికి 'చిన్న' అంటూ ఒక విశేషణ మెందుకండీ! అంత మరీ చిన్నదైపోతే పోల్చుకోడమే కష్టమేమో!

రావు: ఆఁ అదీ! అలా నవ్వాలి. అందుకే– చెప్పివైతును ప్రేయసీ చిన్నమాట నీదు చిరునవ్వులో నవనిధులు గలవు అన్నాడో కవికుమారుడు!

రాధ : ఆ మాట నిజమైనా బాగుండేది! అప్పుడిలా ఎరువు సొమ్ముకోసం పరుగులెత్తే వాళ్ళం కాము.

రావు: కానీ, ప్రతి వస్తువూ అందుబాటులోనే వుంటే క్వీన్ గుల్నార్ అన్నట్టు బ్రతుకు ఉప్పూకారం లేకుండా చప్పబడిపోదా రాధా! జీవిత పరమార్థమంతా లేనిదాని కోసం ఆశించడంలో, దాని ఆగమనం కోసం నిరీక్షించడంలోనే వుంది.

రాధ: ఐతే మీ నవరసాలన్నీ చివరకు వేదాంతంలో సంగమిస్తున్నాయన్నమాట! ఇక మీరు లేవండి బాబూ, నాకు ఆకలౌతోంది.

రావు: నాకుమాత్రం ఏదో నీ ముఖం చూస్తూ నీతో మాట్లాడుతూ తాత్కాలికంగా మరచిపోతానుగానీ, నేను మాత్రం ఆకటి బాధను జయించానా రాధా! వస్తున్నాను పద!

రాధ: రండి మరి!

◆ ◆ ◆

రాధ: ఏమండోయ్! ఒంటరిగా ఈ గదిలో ఏం చేస్తున్నారు?

రావు: సుస్వాగతం రాధా! లోపలికిరా. నిన్న సాయంత్రం బస్సుదిగి పెళ్ళి విడిది .......... కనిపించావో అదే కనిపించడం! వివాహ సంబరంలో ఈ మానవుడొకడున్నాడన్న విషయమే మరపుకొచ్చినట్టుంది నీకు!

రాధ: అదేమిటండీ, అంతమాట నేశారు. ఉదయం నుంచీ మీకోసం వెదకని చోటులేదు. ఎవరి నడిగినా అదిగో అక్కడ ఆ గదిలో, ఇదిగో యిక్కడ ఈ వరండాలో అంటారు. తీరా అక్కడికి వెళ్ళి చూస్తే మీరు కనిపించరు.

రావు: ఈ మధ్య అదృశ్యకరణి అన్న విద్యను అభ్యసిస్తున్నా నేమో మరి!

రాధ: మీ పరిహాసాలకేం గానీ 'మీ వారెక్కడ, మీ వారెక్కడ' అని అడిగే వాళ్ళకు బదులు చెప్పలేకపోయాను. మరీ మా వసంతక్కయ్యైతే 'మరిదిని తీసుకొచ్చి ఒకరి కంట పడకుండా పెట్టెలో పెట్టి తాళం బిగించేశావేమిటే రాధా!' అంటూ నన్ను వేపుక తినేసింది.

రావు: అమ్మో, మీ వసంతక్కయ్యకు అంత కలుపుగోలుతనం గూడానా రాధా! వినడానికే ఆశ్చర్యంగా వుంది.

రాధ: ఆగండాగండి. ఆశ్చర్యపడవలసిన ఘట్టమంతా యిక ముందేవుంది...

రావు: అలాగా?

రాధ: ఈపాటికి మీరూ పసిగట్టి వుంటారనుకున్నాను. మా వసంతక్కయ్యలో పూర్తిగా మార్పొచ్చేసింది!

రావు: వసంతం కాస్తా వెనక్కు జరిగి శిశిరంలో కలిసి పోయిందా ఏమిటి రాధా?

రాధ: అట్లాగే వుంది. పెట్టె నిండుకూ చీరలతో దిగుతుందన్నారుగదా! ఇప్పుడదేం లేదు! ఓ చిన్న చేతిసంచితో దిగిందట!

రావు: ఊఁహు – దిగి?

రాధ: దిగిందా! ఇంతకు మునుపైతే విడిదిలోనూ పందిరిలోనూ వీరవిహారం చేసేదిగదూ! ఇప్పుడదీ లేదు. కదలకుండా, మెదలకుండా ఒకచోట నిశ్చలంగా కూర్చుంది.

రావు: ఓ సందేహం రాధా! ప్రస్తుతం మీ వసంతక్కయ్య ఒంట్లో కులాసాగానే వుంది గదా!

రాధ: మీ దొక పాడు! మనిషి నిక్షేపంలా వుంది. వచ్చిన మార్పంతా బాహ్యావేషంలోనూ, ప్రవర్తనలోనే! తీసుకొచ్చినవి రెండు మూడు సాదా వాయిల్ చీరలేనన్న సంగతి అలా వుండగా బ్రహ్మాండం బ్రద్దలైపోయేలాంటి ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఆవిడగారి మెడ గూడా బోసిగానే వుంది!

రావు: అమంగళం శాంతించుగాక! అదిగాదు రాధా, మీ బావగారి ఉద్యోగానికి భద్రమేగదా! ఈ మధ్య రివర్షను, గివర్షను వచ్చి మనిషి చిక్కుల్లో పడిపోలేదనుకుంటాను...

రాధ: ఏమిటో మరి! నాకు అయోమయంగానే వుంది. ఈ ఎరువు తెచ్చుకున్న సిల్కుచీరల్లో ముస్తాబై, మనవికాని, నగల్లో తుళ్ళిపడుతూ ఆవిడ ఎదుటకు వెళ్ళి నిల్చోడానికే బాధగా వుంది. అట్లాచూస్తే, మనం ఆవిడపైకి ఘోషయాత్రలావచ్చి పడినట్టున్నామండీ! పాపం, మనిషిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది.

రావు: ప్చ్ ప్చ్... అందుకే కలిమి లేములు కావడి కుండలంటారు. ఐనా ఆవిడను గురించి యింతగా జాలిపడడం నీ ఆరోగ్యానికి మంచిదిగాదు. ఇంతకూ అసలు విషయమేమిటో ఆరా తీయడానికి ఎవరూ పూనుకోలేదా రాధా?

రాధ: ఉండండి. ఎవరిదాకానో ఎందుకూ! నేనే కదిలించి చూస్తాను...

రావు: చూద్దువుగానీ, ఏదీ, ఒకసారి యిలా తిరుగు రాధా! నెక్లెసు భద్రంగా వుందిగదూ!

రాధ: మెడ అలా వుండగానే మెడలోని నెక్లెసు ఏమౌతుందండీ?

రావు: కన్నులా వుండగానే కంటిలోని పాపగూడా మాయమైపోతుంది. ఎందుకైనా మంచిది, ఆ నగపైన కాస్త నిగాపెట్టి వుంచు. అలాగే చీరలు గూడా! ఎక్కడి వక్కడ పారేసుకోకు.

రాధ: ఐనా నాపైన ఎంత అపనమ్మకమండీ మీకు!

రావు: అపనమ్మకం కాదు రాధా! ముందు జాగ్రత్త!

◆ ◆ ◆

రావు: మేళగాళ్ళు మంగళం గూడా పాడేసినట్టున్నారు రాధా! ఇక మనం బయల్దేరవచ్చు ననుకుంటాను!

రాధ: తాంబూలాలిస్తున్నారు. తీసుకోగానే పెట్టే బేడా సర్దుకోవచ్చు.

రావు: ఆ సర్దుకోడమేదో తాంబూలా లివ్వకముందే సర్దుకోవచ్చుగా...

రాధ: ఎందుకోనండీ, చాలా నీరసంగా వుంది. కాసేపెక్కడైనా పడుకుంటే బాగుండు ననిపిస్తోంది.

రావు: అవునులే. పెళ్ళికి బయల్దేరినప్పటి ఉత్సాహం తిరిగి వెళ్తున్నప్పుడెలా వుంటుంది? ప్రయాణంవల్ల కొంత, ఆదరణలో చూపబడే తారతమ్యాలవల్ల కొంత, నిద్రసరిగా లేకపోవడంవల్ల కొంత... ఇన్ని విధాలుగానూ ఉత్సాహం దెబ్బతింటుంది. చివరకు నిరుత్సాహము, నీరసము మిగిలిపోతుంది. అవునా రాధా?

రాధ: మనసు గతుక్కుమనేమాట వింటే మాత్రం నిరుత్సాహం కలుగదటండీ!

రావు: ఐతే ఏదో విషయం వుందన్నమాట! ఎవరేమన్నారు రాధా?

రాధ: ఇంకెవరూ? ఆ వసంతమ్మగారే! సూటిగా కాదనుకోండి...

రావు: ఎందుకూ? సూటిగా చెప్పడంకంటే చాటుగా చెప్పడమే ఒక్కొక్కప్పుడు ఘాటుగా వుంటుంది, ఇంతకూ ఆవిడగా రేమంది రాధా?

రాధ: మధ్యాహ్నం భోజనాలైన తర్వాత తాంబూలం వేసుకుంటావా అక్కయ్యా అంటూ దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. ఆమె ఆ మాట, ఈ మాట మాట్లాడుతూ వచ్చి, "ఈ నెక్లెసు కొత్తగా చేయించుకొన్నావా రాధా?" అని ప్రశ్నించింది. చేయించు కోలేదక్కయ్యా, షాపులో కొనుక్కున్నా మన్నాను.

రావు: బాగా అన్నావు!

రాధ: 'ఏమిటో మరి, ఒకప్పుడు నాకూ వుండేది నగలంటే ఉబలాటం! కానీ ఈ మనుషుల వాలకాలు చూచిన కొద్దీ, నగలంటే ముఖం మొత్తింది. ఉన్నాయి గదా అని మనం నగలు పెట్టుకుంటాం. చీరలూ కట్టుకుంటాం. అప్పటికి వీళ్ళ సొమ్ము మనం కాజేసినట్టు- అబ్బ, ఏం మిడిసిపాటు- అనుకుంటారు. ఎందుకొచ్చిన పీడ? మీ బావగారు ప్రమోషను రాగానే రాళ్ళ నెక్లెసు చేయిస్తానన్నారు. ఇదివరకూ గెజిటెడ్ ఆఫీసరు కాదుగా! సరే, ప్రమోషనేమో వచ్చింది, నెక్లెసూ చేయించారు. ఓసి, దానిల్లు బంగారుగానూ, అదేం నెక్లేస్ రాధా! రాత్రుల్లో గోడకు తగిలిస్తే నక్షత్రాలు వెలిగినట్టుంటాయి. కానీ ఏం లాభం? దాన్ని మన మెందుకు తగిలించుకుని

రావాలి, వీళ్ళ ముఖాలెందుకు చింతాకంతై పోవాలి – అని నగను పెట్టెలో పెట్టి ఇలా బయల్దేరి వచ్చేశాను...' అంది!

రావు: వస్తే వచ్చింది గానీ ఆమె మూలంగా మనమొక రహస్యం తెలుసుకోగలిగాము రాధా! ఉన్నవారు తమ సిరిసంపదలను వీలైనంత గుట్టుగా, గోప్యంగా వుంచుకోవాలనుకుంటారు. లేనివాళ్ళు తమ లేమిని వీలైనన్ని కృత్రిమోపాయాలతో కప్పి పుచ్చుకుని, డాబుగా కన్పించాలనుకుంటారు. ఉన్నవారి నిబ్బరం అది! లేనివారి తహతహ యిది! ఇంతకూ మీ వసంతక్కయ్య ప్రసంగంలో వ్యంగ్య మేమీ వున్నట్టు లేదే!

రాధ: అదే చెప్పబోతున్నాను, తమ ఆశ్రమ కన్యలా బయల్దేరడానికి కారణాలు విశదీకరించి 'నగలు పెట్టుకుంటేనేమి, పెట్టుకోకపోతే నేమి రాధా! నిజమైన జడ ఏదో, తిరుపతి తల సవరంచేత పొడుగు సాగిన జడ ఏదో చూడగానే తెలిసిపోవడం లేదా' అంటూ ఆమె ఓ విసురు విసిరింది!

రావు: హతవిధీ! ఆవులించక మునుపే ప్రేవులు లెక్క పెట్టేసిందన్నమాట! ఈ అఘాతానికి తట్టుకుని మళ్ళీ తేరుకోడానికి నాకూ కొంత వ్యవధి కావలిసినట్టే వుంది! వెళ్ళు రాధా, లోపలికి వెళ్ళు. వెళ్ళి తాంబూలాలిస్తున్నరేమో చూడు.

(...ఆనందవాణి)

❀ ❀ ❀